# దేవుని వర్ణించే పేర్లు

దేవునిని ఎవడును ఎన్నడును చూడనప్పటికిని, గుణములో ఆయన ఎట్టివాడైయున్నది మనకు తెలుసు. ఆయన తన ప్రజలతో అనుసరించే వైఖరినిబట్టి ఆయన స్వభావాన్ని మనం చూస్తాం. ఆయనకున్న అపరిమితమైన శక్తి బలములతో ఆయన ఎన్నుకున్న ప్రజలకు పరిచయముంది, వారు కొన్ని సార్లు ఆయన గొప్ప విశేష గుణములను ప్రతిఫలింపజేయు పేర్లతో ఆయనను సూచించారు.

## "భయము"

ఆది. 31:42లో దేవుడు *Pahad*, "భయము" అని వర్ణించబడ్డాడు. "భయము" అని యిక్కడ వ్యక్తపరచింది దేవునియెడల సాధారణంగా ఉండే భయము లేక భక్తితో కూడిన భయము (*Yir'ath*) కాదు, భయము, బెదురు అని సహజంగా చెప్పబడిందే (ద్వితీయో. 11:25; 28:67; 1 సమూ. 11:7లను చూడు).

జ్యేష్ఠునికి దీవెన పోవాలి చిన్నవాడికి దీవెన పోకూడదనే దేవుని సంకల్పము అలక్ష్యం చేయబడినట్టు కన్పిస్తుంది. పిల్లలు యింకను పుట్టకమునుపు, "పెద్దవాడు చిన్నవానికి దాసుడగునని" దేవుడు బయలుపరచాడు (ఆది. 25:23). ఆ వాగ్దానము అలాగున ఉన్నా, ఇస్సాకు దేవుని చిత్తానికి లోబడేదానికి బదులు తన పెద్ద కుమారుడైన ఏశావునకు జ్యేష్ఠత్వపు దీవెన సాధారణమైన విధానంలో యివ్వ తలపెట్టాడు. జ్యేష్ఠత్వాన్ని సంపాదించు కొన్న యాకోబు జ్యేష్ఠత్వపు దీవెనను పొందాడు. స్వరము యాకోబు స్వరమే గాని చేతులు ఏశావు చేతులంటూ ఇస్సాకు యాకోబును దీవించాడు. దేవుని చిత్తాన్ని చెడగొట్టి దానికి బదులు, తానే చెడగొట్టబడినట్టు గ్రహించినప్పుడు, అతడు వణకాడు (ఆది. 27:33). ఈ *Pahad*, "భయము" అనే పేరు దాదాపు అతని వణకును ప్రతిఫలింప చేసి ఉండవచ్చు. మారని దేవుని యొక్క ఉద్దేశాన్ని మార్చుదానికి అతడు ప్రయత్నించాడన్న విషయాన్ని గ్రహించినప్పుడు భయము లేక వణకు అతని హృదయాన్ని నింపింది.

తరువాత ఇస్సాకు సంపూర్ణంగా దేవునికి తన్ను తాను అప్పగించుకొన్నా, తన భయాన్ని తాను మరువనట్టున్నాడు. అతడు తన అనుభవాన్ని యాకోబుతో చెప్పినట్టున్నాడు. *Pahad* అనే పేరు యాకోబుకు ఎందువలన తెలుసో యిది వివరిస్తుంది. తాను ప్రమాణము చేసినప్పుడు యాకోబు ఈ పేరును బట్టియే ప్రమాణం చేశాడు.

## "యాకోబు యొక్క బలిష్ఠుడు"

పాత నిబంధనలో దేవుని గూర్చిన మరొక వర్ణన, ఆది. 49:24లో కన్పిస్తుంది: *'Abir Ya'akob*, "యాకోబు యొక్క బలిష్ఠుడు." వాస్తవంగా, *'Abir*, "బలవంతుడు,

శక్తివంతుడు, ధైర్యవంతుడు" అనేది, గతంలో దేవత్వానికి యిచ్చిన రెండు వర్ణనలకు దగ్గర భావంగా ఉన్నట్టుంది, అంటే, *'El,* "బలవంతుడు," మరియు *Shaddai* "సర్వశక్తుడు" అనేవి.

### *'Abir* అనే పదం యొక్క తొలి ప్రయోగం

*'Abir,* "బలవంతుడు," అనే పదం తన తండ్రి యోసేపును దీవించడంలో కన్పిస్తుంది. యోసేపును అతని సంతతివారును "యాకోబు యొక్క బలవంతునిచేత" కాపాడబడుదురు. *'Abir Ya'akob* యొక్క శక్తివలన తమ విల్లులయందును, ఆయుధములయందును యోసేపు యొక్క వారసులు బలవంతులై ఉందురు. యోసేపు యొక్క సంతతివారైన ఎఫ్రాయీము, మనష్షే గోత్రములవారు, నిజముగా బలముగల గొప్ప జనమైరి. యాకోబు యొక్క ప్రవచనం తరువాత చాల సంవత్సరాలకు, "యెహోషువ యోసేపు పుత్రులైన ఎఫ్రాయిమీయులను మనష్షీయులను చూచి – మీరు ఒక విస్తార జనము, మీకు అధిక బలము గలదు, మీకు ఒక్కవంతు చీటియే కాదు" అని అన్నాడు (యెహోషువ 17:17). కారణమేమంటే, "యాకోబు యొక్క బలవంతుడు" యోసేపు యొక్క పిల్లలతో ఉన్నాడు.

### *'Abir* అనే పదానికి నాల్గు యితర సందర్భాలు

పాత నిబంధనలోని ఈ నాల్గు యితర సందర్భాలు దేవుని వర్ణించడానికి *'Abir* అనే పదాన్ని ఉపయోగిస్తున్నాయి:

1. *'Abir,* **మెస్సీయను తెచ్చుటకు బలవంతుడు**. దేవుని మందిరానికి (ప్రత్యక్ష గుడారానికి) ఒక స్థలాన్ని సిద్ధపరచేవరకు తాను విశ్రమించనని దావీదు యాకోబు యొక్క బలవంతునితో ప్రతిజ్ఞ చేశాడు (కీర్తన. 132:2–5). దావీదుయొక్క పరిశుద్ధమైన స్వార్థ రహితమైన తీర్మానానికి జవాబుగా దావీదుతో మహోన్నతుడు ప్రమాణం చేశాడు: "–నీ గర్భఫలమును నీ రాజ్యముమీద నేను నియమింతును" (కీర్తన. 132:11). ఆయన "మాట తప్పనని" సెలవిచ్చాడు (కీర్తన. 132:12). దానికి సంతోషకరమైన ఫలితం దేవుడు ప్రభువైన యేసును దావీదు కుమారునిగా పంపి, మృతులలోనుండి ఆయనను లేపి పరలోకమందు దావీదుయొక్క ఆత్మసంబంధమైన సింహాసనముమీద ఆయనను కూర్చుండబెట్టాడు. ఈ సన్నివేశంయొక్క అత్యున్నత స్థాయిని పేతురు వేలాదిమంది శ్రోతలకు పెంతెకొస్తు దినాన వివరించుతూ యిలా అన్నాడు: " – అతని (దావీదు) గర్భ ఫలములోనుండి అతని సింహాసనముమీద ఒకని కూర్చుండబెట్టుదును అని దేవుడు తనతో ప్రమాణపూర్వకముగా ఒట్టుపెట్టుకొనెను" (అపొ. 2:30). *'Abir Ya'akob,* "యాకోబు యొక్క బలిష్ఠుడు," తాను దావీదు యొక్క బలిష్ఠుడనని ఈ విధంగా కనుపరచుకున్నాడు.

2. *'Abir* **యెరూషలేమును శుద్ధీకరించి పునరుద్ధరించగలవాడు**. యెషయా కాలంలో భూ సంబంధమైన యెరూషలేము "వేశ్యయై" "నరహంతకులకు" నివాస స్థలంగా మారిపోయింది (యెషయా 1:21). దాని అధికారులు "ద్రోహులు దొంగల సహవాసులు,

లంచాలు కోరేవారు బహుమానాలకొరకు కనిపెట్టేవారు" (యెషయా 1:23). ఏది యెలాగున్నా, యాకోబు యొక్క బలిష్ఠుడు యిలా ప్రకటించాడు, "నా హస్తము నీమీద పెట్టి క్షారము వేసి నీ మష్టును నిర్మలము చేసి నీలో కలిపిన తగరమంతయు తీసి వేసెదను" (యెషయా 1:25). "నీతిగల పట్టణమనియు నమ్మకమైన నగరమనియు" యెరూషలేము పిలువబడునట్లు నమ్మకమైన న్యాయాధిపతులను దానికి అనుగ్రహింతునని ఇశ్రాయేలు యొక్క బలిష్ఠుడు వాగ్దానం చేశాడు (యెషయా 1:26). న్యాయముచేత సీయోను, తిరిగి వచ్చిన వారు నీతిచేతను విమోచింపబడతారు.

క్రొత్త నిబంధన సంఘముయొక్క రాకతో – ఆత్మ సంబంధమైన యెరూషలేముయొక్క నివాసులందరు నూతన హృదయము, నూతన ఆత్మ గలవారగునట్లు తిరిగి జన్మించిన వారు – యాకోబు యొక్క బలిష్ఠుడు తన మాటను నిలబెట్టుకున్నాడు. భూ సంబంధమైన యెరూషలేము పట్టణంకంటే ఎంతో మహిమాయుక్తమైనది ఉనికిలోనికి పిలువబడింది: అది "పైనున్న యెరూషలేము" అని వర్ణించబడిన "ఆత్మసంబంధమైన పట్టణం," సంఘం (హెబ్రీ. 12:22; గలతీ. 4:26).

3 'Abir, **తప్పును ఒప్పుగాచేయు బలిష్ఠుడు**. దేవుని ప్రజలను చెరగొనిపోయి అణచివేసిన ప్రాచీన Captorsను గాని, లేక ఎప్పుడైనా అన్యాయము జరిగినవారిని గాని యాకోబు యొక్క బలిష్ఠుడు "వారి రక్తాన్ని వారు త్రాగేలా చేస్తాడు" (యెషయా 49:24–26; ప్రకటన 16:4–7 చూడు). అందువలన, "ధర్మము, న్యాయము బలత్కారం చేత మీరడం నీకు కనబడినా" (ప్రసంగి 5:8), నీవు దాని విషయంలో ఎన్నడు నిరాశపడకు.

4. 'Abir, **పరలోకానికి తెచ్చుటకు ఆయన బలిష్ఠుడు**. దేని ద్వారాలు "నిరంతరం తెరిచిపెట్టబడతాయో" ఆ పట్టణాన్ని నిర్మించడానికి 'Abir, బలిష్ఠుడు తప్పక అవసరమై యుంటాడు (యెషయా 60:11). "ఆ పట్టణం పగటికి సూర్యకాంతియైనను, రాత్రికి చంద్ర కాంతియైనను" అక్కరలేనిదై ప్రభువే దానికి దీపముగాను, దేవుడే దానికి "మహిమ గాను" ఉంటారు (యెషయా 60:19, 20). పాప భూయిష్ఠమైన ఆత్మలను "శాశ్వత శోభాతిశయముగాను, బహు తరములకు సంతోష కారణముగాను" చేయగలవాడు ఆ బలిష్ఠుడు మాత్రమే (యెషయా 60:15).

'Abir, "బలిష్ఠుడు" అనే పదం పరిశుద్ధాత్మచే ఎలా ఉపయోగింపబడిందో: యోసేపును దీవించడంలోను, క్రీస్తును రాజుగా చేయడంలోను, యెరూషలేమును శుద్ధీకరించి పునరుద్ధరించడంలోను, ప్రతి తప్పును ఒప్పుగా చేయడంలోను, పరలోక పట్టణపు నిర్మాణంలోను చూచాం.

## "ఇశ్రాయేలునకు బండ"

ఆది. 49:24లో దేవునికి ఉపయోగింపబడిన వర్ణన *'Eben Yisra'el*, "ఇశ్రాయేలునకు బండ" అనేది. దేవుణ్ణి బండగా వర్ణించడం ఆయన బలాన్ని (యోబు 6:12), స్థిరత్వాన్ని సూచించుతాయ్ (యోబు 38:30).

ఫిలిష్తీయులకు విరోధంగా దేవుడు ఇశ్రాయేలీయులకు చేసిన సహాయానికి జ్ఞాపకార్థంగా సమూయేలు ఒక రాతిని ఉపయోగించాడు. దానికి అతడు ఎబెనెజర్, "సహాయపు రాయి" అని పేరు పెట్టాడు (1 సమూ. 7:12). "నేను నిత్యము చొచ్చునట్లు నాకు ఆశ్రయ దుర్గముగా ఉండుము నా శైలము నా దుర్గము నీవే నీవు నన్ను రక్షింప నిశ్చయించియున్నావు" అని దావీదు అనడంలో భద్రత అనేది తన మనస్సులో ఉన్నట్టుంది (కీర్తన. 71:3). "యెహోవావంటి పరిశుద్ధ దేవుడు ఒకడునులేడు. నీవు తప్ప మరి ఏ దేవుడును లేడు మన దేవునివంటి ఆశ్రయదుర్గమేదియు లేదు" అని హన్నా దేవుని స్తుతించింది (1 సమూ. 2:2). "యెహోవాయే నిత్యాశ్రయదుర్గము" అని యెషయా స్తుతించాడు (యెషయా 26:4).

బండలోనుండి అద్భుతరీతిగా జనింపజేయబడిన నిజమైన నీటిని ఇశ్రాయేలీయులు త్రాగారు (నిర్గమ. 17:6; కీర్తన. 78:15). క్రీస్తనే ఆత్మసంబంధమైన బండనుండి త్రాగారు, క్రీస్తు మోషే ద్వారా ఆయన వారికి ఆత్మసంబంధమైన ఉపదేశాన్ని కూడా ఆ దినాల్లో అందించాడు (1 కొరింథీ. 10:4, 5). అయితే వారిలో ఎక్కువ మందిని దేవుడు ఇష్టపడ లేదు, ఎందుకంటె ఆత్మ సంబంధమైన బోధను త్రాగుటకు వారు నిరాకరించారు. వారి రక్షణ దుర్గమును వారు "అపహసించారు" (ద్వితీయో. 32:15).

పాత నిబంధన దినాలలో క్రీస్తు ఆత్మసంబంధమైన బండయైయుండడం మాత్రమే గాక, క్రొత్త నిబంధన దినాలలో ఆయన రాయి (బండ) గా ఉంటాడని ప్రవచింపబడింది. మెస్సీయ రాయియై ఉంటాడని ప్రవక్తలు ద్వంద్వార్థంతో చెప్పారు. తప్పు స్వభావం గలవారు తొట్రిల్లినట్టుగా ఆయన రాయియై ఉంటాడు (యెషయా 8:14), కట్టడపు రాయిగా ఆయన యూదా నాయకులచే తృణీకరింపబడతాడు. అలా తృణీకరింపబడిన రాయియే మూలకు తలరాయియైయుండి ఇరువైపుల గోడలను బంధించునదై యుంటుంది (కీర్తన. 118:22). కట్టడంలో ముఖ్యమైన రాయిగా ప్రభువైన యేసు ఉంటాడు: " –సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే అది పరిశోధింపబడిన రాయి అమూల్యమైన తలరాయి బహు స్థిరమైన పునాదియైన మూల రాయియై యున్నది" (యెషయా 28:16).

ప్రవచనాలు నెరవేర్చబడ్డాయి. క్రైస్తవ్యము చిన్న రాళ్ల మీదనో, ముక్కల మీదనో అంటే, *petros* మీద గాక, పెద్ద బండ, గొప్పదైన రాయి *petra* మీద కట్టబడింది (మత్తయి 16:16–18 చూడు). "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసు క్రీస్తే" (1 కొరింథీ. 3:11). వాక్యమునకు అవిధేయులై, అవిశ్వాసులు క్రీస్తుయొక్క సందేశం వద్ద తొట్రిల్లుతారు (1 పేతురు 2:7, 8). యూదులు "ఆ బండమీద" పడి తునకలైపోయారు, క్రింద పడినవారు "నులి" చేయబడి చెదరిపోయారు (మత్తయి 21:44). "సజీవమైన రాయిగా" ఆయనను అంగీకరించినవారికి ఆయన అమూల్యమైనవాడు – కాలంలోను నిత్యత్వంలోను వారికి స్థిరమైన పునాదిగా ఉంటాడు (1 పేతురు 2:4, 7)

## "రోషముగలవాడు"

*Qanna*' "రోషము" అద్దకము వేయబడిన రీతిని, ఎక్కువ ఎఱ్ఱగా మారుట అనే మూల భావంనుండి వచ్చింది, గాఢమైన ఉద్వేగ ఫలితంగా అతని ముఖపు రంగు ఎఱ్ఱ బారింది అనేదాన్ని యిది సూచిస్తుంది. *Zelos*, అనే గ్రీకు పదానికి "అసూయ," "మరుగుట" అనే మూల భావంనుండి వచ్చింది. దేవుడు రోషముగలవాడు అని చెప్పడంలో గొప్ప ఉద్వేగంతో *Qanna*' ఉన్నట్టి స్థితిని సూచిస్తుంది.

దేవునికి ఎన్నడును అసూయ ఉన్నట్టు చెప్పబడలేదు, కాని ఆయనకు రోషమున్నట్టు చెప్పబడింది. మరియు "రోషముగలవాడు" (*Qanna*') అన్నది ఆయన పేర్లలో ఒకటి (నిర్గమ. 34:14). అసూయ అనేది – మరొక వ్యక్తిని స్థాన భ్రంశం చేయాలనే బలమైన కోర్కె, అసూయ అంటే, అది పూర్ణంగా సాతానుకు సంబంధించినది, అది శరీర కార్యాల్లో ఒకటి (గలతీ. 5:21). ఒక వ్యక్తిని తనకొరకే ప్రత్యేకంగా ఉంచుకోవాలనేది దయ్యపు స్వభావమైయుండవచ్చు (అపో. 13:45; రోమా 13:13; గలతీ. 5:20) లేదా అది దైవ సంబంధమైనదైనా అయ్యుండాలి (2 కొరింథీ. 11:2). పొగడబడదగిన విధంగా, ఆసక్తితో వెదకడమో వెదికించుకొనడమో "మంచిది, మేలైనది కూడా" (గలతీ. 4:18) అయితే స్వార్థపరమైన విధానంగా కాదు.

మానవాళికి సృష్టికర్తయైన దేవుడు, మానవ ప్రేమాభిమానాలను, నమ్మకాన్ని పొందనర్హుడైయున్నాడు. మనిషి యొక్క పూర్ణ హృదయం, పూర్ణ మనస్సు, పూర్ణాత్మ, పూర్ణ బలానికి తక్కువైన దానిని ఆయన అంగీకరించడు (ద్వితీయో. 6:4–6; మార్కు 12:30). ఏ దేవతకు ఆయన రెండవ స్థానంలో నిలిచియుండడు (నిర్గమ. 34:14; యెషయా 42:8), భూ సంబంధమైన ఏ యేలికకే గాని (అపో. 5:29), భూ సంబంధమైన ఏ భక్తికి లేక విశ్వాసానికే గాని ఆయన రెండవవాడై ఉండడు (లూకా 14:26).

సమస్త మనుష్యులను నిర్మించుకొనడంలో తన యొక్క సహజమైన హక్కును అతిక్రమించడం, రోషముగల దేవుని యొద్దనుండి నాశనం కోరడమే ఔతుంది (ద్వితీయో. 6:15). "మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు" (హెబ్రీ. 12:29; ద్వితీయో. 4:24 చూడు). "రోషముగలవాడని" పేరుగల "జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీ. 10:31).

## ముగింపు

దేవుడు తన పేర్లలో కొన్నింటిచే ఈ విధంగా వర్ణింపబడడం మనం చూచాం. ఆయనకు భయపడవలసిన దేవుడు, ఆయన సర్వశక్తుడు, బలమైన రాయి, తనకే భయభక్తులు కనుపరచి భయపడాలని కోరే దేవుడు. ఆయనను వర్ణించే ఈ పేర్లను మనం గ్రహించినప్పుడు, దేవుడంటే ఎవరో, ఆయన తన ప్రజలకు ఏమైయున్నాడో, ఆయన మన వద్దనుండి ఏమి ఎదురు చూస్తున్నాడో మనకు స్పష్టమైన అవగాహన ఉంది.